# ఉత్తరంలో చిందులు.... *

(లేఖారూపం)

"కొత్తపల్లి లలిత"

...ఈవేళ నీకీ వుత్తరం వ్రాద్దామనుకోలేదు. మధ్యాహ్నం చాలా ఎండగావుంటే మట్టి చిలక్కొయ్యకు తగిలించి కుర్చీలో కూలబడ్డాను...ఇన్ని పొన్న బుఱువుకు పేముకుర్చీ కిఱ్ఱుమని బాధ పడ్డది···నిజంగా నువ్వన్నట్లుగా స్థూల కాయం వుంటే కష్టమేనే;...వొళ్లంతా చమటతో తడిసి పోయి మట్టి వాసనేస్తోంది...అందుకు కారణం? కంపు కొడ్తున్న బనీను—ఛా, అంటూ చాకలిగి తెచ్చింది తొడుక్కుందామని బీరువా తీశాను...హనుమంతుని లా లంక లాంటి బీరువానంతా అల్లకల్లోలం చేసినా ఎక్కడా లేనిదే! పాపం—నా బనీను అని జాలి వేసింది—ఎక్కడుందో? ఏమయిందో? రెండో ప్రయత్నంలో నీ జార్జెట్ చీర మడతల్లో దాగి వుండటం కనబడింది...సరే అని బనీను తొడుక్కుంటిని గదా—సెంట్ వాసన నన్ను గట్టిగా కలిపివేసింది...దానితో స్వర్గసుఖం జ్ఞాపకానికొచ్చింది...

వెంటనే కాగితం ముక్క సంపాదించి నీకు ప్రేమ లేఖ వ్రాద్దామని నిశ్చయించు కొన్నాను...ఎక్కడా దొరక లేదు...నా లెటర్ పాడ్ ఏమి చేసావో? నాలుగు కాగితాలు పొయ్యిలోకి చింపుకొని అది కాస్తా బొగ్గుల డబ్బాలో కుక్కేదావనుకుంటాను...ఏ? సరేగానీ —ఏమే, వంట గదితాళం చెవులు మంగళ సూత్రంతో ముడి వేసికొని పుట్టింటికి చక్కా వెళ్లావేమిటే? మొత్తానికి మంచి దానివే...సరే—జరిగిన పని ఇది— 'శేషాద్రి వేంకటప్పారావు' అన్న పేరుగల విద్యార్థి కాంపోజిషన్ నోటుబుక్కులో నుంచి నాలుగు కాగితాలు వంకరటింకరగా చింపేశాను— వాడెప్పుడో ఈ ఆకస్మికమైన 'ఖాళీస్థలాన్ని చూసుకొని —"మనమాష్టారు గజ దొంగరా నిజంగా" అని స్నేహితునికి చెప్పక తప్పదు! పైగా వానికిలాగ జవాబు వచ్చి వుంటుందని నా గట్టి నమ్మకం..."పోనీలేరా...ఇంకా పూర్తిగా పుస్తకమే కాజెయ్యలేదు లేక కోమటికి అదో పరక్కి అమ్మేసుకో లేదు సంతోషించరా—వాళ్లకిచ్చే జీతాలేమూలకొస్తవిరా?"...అవును బ్రతక లేకపోతే బడిపంతులు అన్నారు!......"పోనీ—వాడికి నా దీనస్థితి తెలుస్తే గా జాలి పడడానికి? నేను భార్యకు ప్రేమలేఖ వ్రాద్దామని చింపుకొన్నానని వాడు అనుకోగలడా? ఇంతకూ నాదీ భాగ్యం! (అసలు నువ్వు కూడా ఈపాటికిది చదివి కొంగు చాటు చేసుకొని దొంగనవ్వులు నవ్వుతున్నావుగదూ?)

నిజంగా-ఎందుకో గాని కడుపునిండా భోంచేసినా సరిగ్గా నిద్ర పట్టడం లేదు...కలతగా వుంటుంది . ఇంతలో చీకట్లో నక్షత్రంలా వస్తావు...రక రకాల ఆకర్షణీయమైన పోజుల్లో వస్తావు...ఒక్కొక్క సారి పెసరట్టువేస్తూ వుల్లిపాయల వాసనతో, ఇంకోసారి మొగలిపూల జడ తీవితో, నవ్వుతూ కులుకుతూ—అల్లరి పిల్లలా గాజుల చప్పుడుతో నా కుర్చీ వెనక్క వచ్చి క్రాఫింగ్ని వల్లని వేళ్లతో సవరిస్తూ— తెంకి పిల్లవవుతావు! ఇంకా ఈ దృశ్యాల్ని రంగురంగుల్లో వర్ణిస్తే నీకళ్లు సిగ్గుతో మూతలు పడ్తవి...నాకు ఆ క్షణంలో కనబడవు...బాధగా వుంటుంది నీకు కోపమొస్తే చిటి మూలాన్న మరీ అందంగా మారి పోతావు గా!...ఎవ్వరో పరాయి వాళ్లు ఆ మెఱుపుని గమనిస్తారు...నాకు లేనిదే ఇంకోళ్లనుభవిస్తే అసూయ పుడ్తుంది. ఊహూ...నేను చెప్పను...నామనస్సులోనే ఇంద్ర ధనుస్సుని దాచేసు కొంటాను...ప్రస్తుతం ఇప్పుడు చంద్రుణ్ణిమేఘం కమ్ముకొని చలింప జేసినట్లుగా నన్ను ఉద్రేకం........

ఇటువంటి మానసికావస్థలల్లో నీవు ఎంతో అలవికానంత సౌందర్యంతో దేదీప్యమానంగా వెలిగి పోతావు...అప్రాప్త మనోహారిలా...స్వప్న సుందరిలా...భావ కవిత్వంలా తియ్యని వెన్నెల్లా, కనబడ్తావు...ఏమిటీ విచిత్రం? నువ్వేమంటావో నాకు తెలుసును—"హా ప్రేయసీ...రూప గర్వితా!" అంటూ శూన్యంలోకి చేతులు జాచండి అంటావు— "నేను మీ ప్రక్కనే గాలిలా అంటి పెట్టుకొని వున్నప్పుడీ ప్రేమలూ, ప్రతాపాలూ ఏమవుతవండీ?"—అని ప్రశ్న వేస్తావు...స్పెషల్ తెనుగు చదివావు...వియోగానికున్న తియ్యని లక్షణాలెన్నో ప్రబంధాల్లో చదవలా? కానీ ఏమి చెయ్యగలం? ఈ చెవితో విని ఆ చెవితో విడిచేస్తారు స్టూడెంట్సు! కానీ ఎంత శోచనీయమో ఆలోచించి చూడు—

## ఉత్తరంలో చిందులు....

నీకు కొంచెం సీరియస్ వార్నింగ్ ఇవ్వాలి—దీన్ని సగం చదివి పారవేయకు...ఎక్కడో పెట్టి మర్చి పోతావు... ఆ (పెలమన్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలినువ్వు...కొంచెం జ్ఞాపక శక్తి బాగుపడ్తుందేమో!) లేక పోతే మధ్యమధ్య నే నీ కిచ్చిన సంచులో దాచుకుంటూ మళ్లా చదువుతూ పూర్తి చెయ్యి (ఇలా చేస్తానని నువ్వే వ్రాశావుగా!) దాని పార వెయ్యకు—

సరేగానీ—నువ్వెందుకే ఇంత మౌనం వహిస్తావూ? పురుషుడు ఎంత మంచివాడైనా ఇలాంటి చిన్న చిన్న చర్యలే పశుత్వాన్ని పైకి రానిస్తవి...అట్టి 'ఉగ్రత' రాకుండా సమత్వంగా వుంచేది స్త్రీ—ఆ వృక్షచ్ఛాయవంటి చల్లని స్పర్శ. ఈ రోజుల్లో చాలా వరకూ తగ్గిపోయింది గాబట్టే విధవ విడాకుల కేవి వచ్చి పడ్డవని నా విశ్వాసం...కొంత అహంకారాన్ని, స్వార్థాన్ని ఇద్దర్లో ఎవ్వరో వొకరు తగ్గించుకోక పోతే ఇంట్లో సామరస్య మెలా వస్తుంది? ఈ మానసిక బానిసత్వాన్ని అనాదినుంచి ఎక్కువగా స్త్రీ భరించేది ...త్యాగం చేయనిదే మానవుడేమి సాధించగలడూ? ఈ హెచ్చు తగ్గులు లేని జీవితానికి పూర్ణత్వాన్ని అంట గట్టలేము...ఎవ్వరో వొకరు 'ఓర్పు' వహించాలి... తప్పదు ...పురుషుడా? స్త్రీయా?—అన్నది వివాదం అంతే భేదం! ఈ లక్షణాన్ని స్త్రీత్వానికి ఆపాదించారు ప్రాచీనులు...ఈ క్షమాశక్తి స్త్రీలో అంతర్గతమైవున్న సౌందర్యమన్నారు.' నేటిమానసిక శాస్త్రజ్ఞులు ఇదే అంటున్నారు కదా? ఈ గుణాన్ని పురుషునికి రప్పించాలని మీ యత్నం—కానివ్వండి—వెలుగు—చీకటీ—అప్పుడు మేము—నేడు మీరు... ...

విద్యావతివి...నీవు రేషనల్‌గా ఆలోచించి 'చూసుకో—నువ్వేమన్నా సరే బొత్తిగా సెంటిమెంట్సు చచ్చిపోతున్నవి...మానవుడు తోడి మానవుని ప్రాణం తియ్యనిదనే—విచక్షణ పోగొట్టుకొన్నాడు...అందరిదీ ప్రాణమే అని పార్టీ నాయకులు ఘోషిస్తే మాత్రం—ఏమిటి లాభం! నీకిచ్చిన కామూ దేశాయి చిత్ర సంపుటి చూడు...నిశితంగా ప్రళయ తాండవం చేస్తున్న ఈశ్వరుణ్ణి తన హావభావాదులతో ప్రణయ వాక్యాలతో వశపర్చుకొని సృష్టిని చేయిస్తున్న ప్రకృతి స్త్రీమూర్తి. అందుకే మహాను భావుడన్నాడు—"Oh woman, lovely woman—Nature made thee to temper man." అని...నిజంగా ఆలోచిస్తే స్త్రీ పురుషునికి అధికంగా ఇవ్వగలిగేదేమీ లేదు—ఒక్క కరుణామృతాన్ని వినాగా ఏమీ Extra గా ఇవ్వలేదు! అదే మానవత్వాన్ని సంపూర్ణంగా వ్యక్తపరుస్తుంది...' కాదెందుకు వాంఛింపా?' అంటావు—గానీ మానవునిలో వున్న భయోత్పాతాన్ని (ఇది పుట్టుట ఒకనాడు చచ్చి పోవడానికే అన్న నగ్న సత్యాన్ని తెలుసుకోవడం చేత కల్గిన మానసిక పరిణామం) సాధ్యమైనంత వరకూ పైకి రానివ్వకుండా వుంచుతుంది' కరుణ'—అది శరీరికంగా అవసరం అన్నమాట—పురుషుడు స్త్రీకి ఇచ్చేది ఇంతే—పెళ్లి చేసుకోడం, సంసారం—అన్నవన్నీ మానవుని మానసిక పరివర్తనలకు నిరూపణలు—జీవిత గర్భంలో కన్న ఏకాంతాన్ని కొంతవరకూ దూరంగావుంచడానికేగా! స్త్రీ పురుషులు ప్రేమించుకొని ఒకర్ల సాన్నిధ్యంలో ఇంకొకర్లు వారి వారి ఏకాంతాన్ని మర్చిపోవాడానికే ప్రపంచంలో పడ్తున్న బాధలు!...ఇది Same sex వాళ్లు ఇస్తేకొంత వరకే అవుతుంది...స్త్రీ పరిపూర్ణంగా ఇవ్వగలదు—ఈ ప్రేమ ఇంత బలాన్ని ఇస్తుందనుకోవడం కేవలం 'భ్రాంతి' కావచ్చును...అదీ అంత శక్తివంతమైనదనుకొని ముందుకు సాగుతున్నప్పుడు అది 'సత్యం' కాదని మన మేధాశక్తితో నిర్ధారణ లెందుకూ చేయడం? ఇద్దరి మానవుల్ని కరుణా పూరితమైన హృదయాలు మరింత దగ్గరగా తీసుకొని వస్తవి...ఈ అత్యంత శక్తివంతమైన గుణం స్త్రీలో వుంటే—ఆ మెలో పురుషునకు నిత్యనూతనంగా అగుపించే ఏదో వొక ఆకర్షణ వుండక మానదు...ఈ లేదబ్బు అందాన్నిస్తుంది...అనురాగ మైన దాంపత్యానికి ప్రాతిపదిక అవుతుంది...మన జోడు ఇలా వుండవలెనని నా ఆదర్శం...నువ్వు అర్ధాంగివి...గృహలక్ష్మివి...ధర్మపత్నివి నాతో సహాను భూతి జూపిస్తావా? ఏమో—సమాన హక్కుల రోజులివి...నాతో ఏకీభవిస్తావా? నీ దయ—ఎందుకిలా స్త్రీ పురుషులు ఇంత దగ్గరగా రావడానికని ఇన్ని బాధలీ ప్రపంచంలో పడ్తారో? ప్రేమకోసం—అని చిలిపిగా నవ్వుతూ సురువుగా తేల్చేస్తావు...నువ్వుబొత్తిగా కొంటెదానివి.........

(తరువాయి 34-వ పేజీలో)

# స్వతంత్రోషస్సూక్తము

## విముక్త జనత!

ఓహో! ఓహోహో!!

క్రూర కర్కశ కఠోర పిశాచమా!

ఘోర భయానక-మా! నిశాచరీ!!

నీ జీవిత అంతిమ నిశ్వాసం

మా జీవిత ప్రథమాశ్వాసం

నీ జీవితమున కాఖరు పర్వం

మా జీవిత స్వర్గారోహణ పర్వం

నీకు—

నరకకూప అవరోహణం

ఓహో!

నీ వేదన గానం

నీ రోదన గాత్రం

వినిపింపదు

కనుపింపదు

బహిష్కృతి—నీకై

తిరస్కృతి—నీకై

పదచ్యుతి—నీకిక—ఓహో

## స్వేచ్ఛాగతం:

మా భావి మనోహర మహో!

మా భావికి మహోదయ మిదే!

మారుతుంది విశ్వం

చేరుతుంది నూత్నం

ఉషోదయం

శుభోదయం—

(31వ పేజీ తరువాయి)

ప్రేమను హృదయంతో అవగాహన చేసుగోవాలి... వాదప్రతివాదనలతో, భావవికాసంతోనూ లాభం లేదు... అటువంటి నిండు ప్రేమ కాళ్లకు బంధాలు వేయదు... స్వేచ్ఛ, హాయినిస్తుంది...ప్రేమ పుష్పసౌరభం వంటిది... ఒక కాల ప్రవాహం వంటిది—ఈ రూపం మనలోనే వుంది ...ఎక్కడో కొండ మీదవుందని ప్రేమకు లేనిపోనికోణాల్ని కల్పించు మానవుడు శరీరకంగా బాధపడుతూంటాడు... కొన్నిటిని మేధాశక్తితో సాధించలేమని తెలుసుకోవాలి... హృదయంతో అర్థంచేసుగోవాల్సివుంటుంది అని గ్రహించాలి—భక్తిలో, ప్రేమలో, మతంలో ఇదే అంతిమదశ! అన్నట్లు—నీకు జ్ఞాపకం వుందా? నీవు పుట్టిన రోజున ఇచ్చిన శరత్ నవలలు? పైని చెప్పిన సన్నగీతలవంటి భేదాల్ని ప్రత్యక్షంగా మనకాయన సాహిత్య వీధుల్లోని వ్యక్తులచేత అనుభవింపజేసి—నిశితంగా చూపించడానికి సాహసించినది ఒక్క శరత్ బాబు! చూడు—మనకా ప్రేమ మెలపుతీగల్ని మనస్సుని కదల్చే సన్నివేశాల ద్వారా ఎంత సహజంగా చిత్రిస్తాడో...కావ్యజగత్తు ఈ దృష్టితో వారి సాహిత్యాన్ని గమనించాలి! సరే—నీకు పిల్లల పుస్తకాలు దిద్దుకోవాల్సిన పనివుంది...' మీకు ప్రేమలేఖలు వ్రాయడం చేతగాదని' వెకాకోళం చేస్తావులే—పోనీ—ఇప్పటికీ సెలవు...మంచి పెద్ద జవాబు చక్కని భాషలో వెంటనే వ్రాస్తావుగదూ...మర్చిపోవద్దు—.

